మహబూబ్‌నగర్ వార్త


నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# అనుమతులు 14.. ఓపెన్ 44

## ఫీజులు ఫుల్లు.. పేదల జేబులకు చిల్లు..

- ధనార్జనే ధ్యేయంగా పాఠశాలల నిర్వహణ
- అమలుకాలని నిబంధనలు
- జీవోలకు పరిమితమైన ఫీజులు
- ఇష్టారీతిగా కొత్త స్కూళ్లకు అనుమతులు
- ఒక చోట గుర్తింపు మరోచోట నిర్వహణ
- నిద్రావస్థలో విద్యాశాఖ అధికారులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 14, ప్రభాతవార్త:**

**" ఇల్లు కట్టి చూడు.. పెండ్లి చూసి చూడు అన్నది పాత సమేత.. ఫీజు కట్టి చూడు..పిల్లలను చదివించి చూడు..అనేది కొత్త నానుడి.."**

ప్రైవేటు పాఠశాలలు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నాయి. అనుమతులు లేకున్నా బిల్డింగ్ చూయించి..తరగతులు స్టార్ట్ చేస్తున్నారు. ఇదో పర్మిషన్, అదిగో పర్మిషన్ అంటూ తీరా పరీక్షల సమయానికి ఇతర పాఠశాలల అనుమతి పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్ జారీ చేసి పరీక్షలు రాయించి చేతులు దులుపుకుంటున్నారు. ఏ ఒక్క పాఠశాల కూడా పూర్తి స్థాయిలో నిబంధనలు పాటించడం లేదంటే అతిశయోక్తి కాదు..ఫీజుల వసూలులో ఉన్న ధ్యాస పిల్లల భవిష్యత్తు విద్యావ్యవస్థపై లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి మహబూబ్‌నగర్ జిల్లాలో 14ప్రాథమిక స్థాయి, 3ఉన్నతస్థాయి పాఠశాలలకు అనుమతులు రాగా సుమారు 40పాఠశాలలకు పైగా కొత్తవి ఏర్పాటు చేసి అడ్మిషన్లు సైతం తీసుకోవడం గమనార్హం. ఇంకా కొన్ని పాఠశాలల అనుమతులు అండర్ ప్రాసెస్‌లోనే ఉన్నా తరగతులు కూడా కొనసాగిస్తుండడం ఆశ్చర్యకరం.

ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ప్రతిఏటా ఇష్టారీతిన ఫీజులను పెంచుకుం టూ పోతూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. సగటు చిరు ఉద్యో గులు తమ జీతాల్లో సగ భాగం పిల్లల ఫీజులకే వెచ్చించాల్సిన పరిస్థితి నెల కొంది. పిల్లల భవిష్యత్ బాగుండాలనే తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకొని స్కూల్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు అయితే ప్రతియేటా 20 నుంచి 30 శాతం వరకు ఫీజులను పెంచేస్తున్నాయి. ఉద్యోగుల వేతనం పెరగకున్నా ఫీజులు మాత్రం ఏటాపెంచుతూ దోచేస్తున్నారు.

### నిద్రావస్థలో విద్యాశాఖ..

పాఠశాలల ప్రారంభ సమయంలో హడావుడి చేయడం, ఆ తరువాత యథావిధిగా కొనసాగడం విద్యాశాఖ అధికారులకు షరా మాములే అయింది. విద్యార్థి, ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు, ఎవరెంత చెప్పినా ఫీజుల విషయంలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శలున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే పలు పాఠశాలల స్కూల్ ఫీజులకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని ఆరోపణలున్నాయి. పాఠశాలలకు చాలా వరకు అనుమతులు లేకున్నా తరగతులు నిర్వహిస్తు న్నారు. అదే కాకుండా పాఠశాలల్లోనే స్కూల్ డ్రస్సులు, టై బెల్టులు,పుస్తకా లు కొనాలనే నిబంధన తల్లిదండ్రులకు మరింత ఆందోళన కలిగిస్తున్న అంశం. బయట అంటే ఓపెన్ మార్కెట్‌లో బుక్ స్టోర్‌లల్లో రూ.100కే లభిం చే బుక్ పాఠశాలల్లో రూ.150 వరకు విక్రయిస్తూ అడ్డంగా దోచుకుంటు న్నారు. ఇలా ఫీజు ఒక్కటే కాదు...స్కూల్ ఫీజు ఒక్కటే కాకుండా రకరకాల ఫీజుల పేరుతో తల్లిదండ్రుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఒకరేమో సీబీఎస్‌ఈ సిలబస్ అని, మరో స్కూల్ ఐసీఎస్‌ఈ, కేంబ్రిడ్జి యూనివర్సిటీ స్టాండర్డ్ అని, లైబ్రరీ, కంప్యూటర్, అడిషనల్ క్లాసులు, ఐఐటీ, జేఈఈ కోచింగ్, ప్రైవేటు క్లాసులు, స్పెషల్ క్లాసులు, బిల్డింగ్ ఫీజు, స్పోర్ట్స్ ఫీజు ఇలా రకరకాలుగా ఫీజు వసూలు చేస్తున్నారు. ఇవే కాకుండా అదనంగా బస్సు, వ్యాన్ రవాణా ఫీజులు అదనం. వీటితో పాటుగా స్కూల్ డే, స్పోర్ట్స్ డే, కల్చరల్ యాక్టివిటి ఫీజులు, మరోవైపు యూనిఫాం వారి దగ్గరే కొనడం, వారు సూచించిన పుస్తకాలే కొనడం, స్పోర్ట్స్ యూనిఫాం, యోగా డే, ఇతర ప్రత్యేక రోజులకు వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు.

### తోకల పేర్లతో మాయ..

పాఠశాలల పేర్ల ముందు తోకలు తగిలించి స్కూల్ పేర్లతో మాయ చేస్తు న్నారు.టెక్నో,ఇంటర్నేషనల్, నేషనల్,కేంబ్రిడ్జి స్కూల్, ఇంటర్నేషనల్ అంటూ అధిక ఫీజులను అదనంగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. కేవలం పేర్లు మాత్రమే ఉంటాయి.. అందుకు తగ్గ చదువులు - మిగతా3లో..

### విద్య వ్యాపారంగా మార్చొద్దు

అనుమతి లేకుండా పాఠశాలలు కొనసాగించడం కుదరదు. కొన్ని యాజమన్యాలు ఆర్జేడీ స్థాయి నుంచి అనుమతులు పొందుతున్నారు. ఇప్పటి వరకు 14 ప్రైమరీ స్కూళ్లకు, 3 హైస్కూళ్లకు అనుమతులు వచ్చాయి. 2005లో వచ్చిన జీవో 91 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు, గుర్తింపు, ఉపాధ్యాయులు అర్హతలు, అనుమతులు, ఫీజుల నియంత్రణ లాంటి అంశాలు ఈ జీవోలో ఉన్నాయి. అయితే ఇది గతంలో రద్దు చేశారు. కొట్టేశారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉన్నది. గతంలోనూ ప్రొఫెసర్ తిరుపతి రావు ఆధ్వర్యంలో కమిటీ వేశారు.. అవి కూడా అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకూనూరు మురళి ఆధ్వర్యంలో కమిటీ వేశారు. త్వరలో అమలులోకి రావొచ్చు. ఇవన్నీ కాకున్నా లోకల్ అథారిటి, స్కూల్ కమిటీ, ఫీజు రెగ్యులేటరీ కమిటీ, కాకుండా సోషల్ సర్వీస్ విధంగా ఆలోచించినా ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులు నామమాత్రంగా తీసుకోవాలి. విద్య, వ్యాపారంగా మార్చొద్దు.

*- డీఈవో ప్రవీణ్‌కుమార్, మహబూబ్‌నగర్ జిల్లా*




---

సన్న బియ్యం పంపిణీలో

# అవకతవకలు

గంటల తరబడి రేషన్ దుకాణాల దగ్గర పడిగాపులు



రేషన్ షాప్ దగ్గర నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

**వనపర్తి, జూన్ 14 ప్రభాతవార్త :** వనపర్తిలో రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని వెంటనే అరికట్టాలని సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి జె. రమేష్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రేషన్ షాపులను సందర్శించారు. బండారు నగర్ రేషన్‌షాప్‌లో బియ్యం పంపిణీని పరిశీలించి, వినియోగదారులతో ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సక్రమంగా బియ్యం సరఫరా -మిగతా3లో..

# గోపాల్దిన్నె లింక్ కెనాల్‌కు రూ.120కోట్లు

- 120 కోట్లతో సింగోటం గోపాల్దిన్నె రిజర్వాయర్ లింకు కెనాల్‌కు శంకుస్థాపన..
- భూములు కోల్పోతున్న రైతులకు రూ.11లక్షల వరకు నష్టపరిహారం
- ఈ నెల ఆఖరి వరకు రైతుబంధు పథకం నిధులు రైతుల ఖాతాలో జమ



సింగోటం గోపాల్దిన్నె లింకు కెనాల్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల ,జూన్ 14, ప్రభాతవార్త;** సింగోటం గోపాల్దిన్నె లింక్ కెనాల్కు 120 కోట్లు మంజూరి చేసినట్లు రాష్ట్ర ఎక్సైజ్ మరియు టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శనివారం నాడు మండలంలోని సంగినేనిపల్లి సమీపంలో లింకు కెనాల్కు శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం కే ఎల్ ఐ నీళ్ల ద్వారా సింగోటం నుండి గోపాల్దిన్నె రిజర్వాయర్కు సాగునీరు కోసం చేపట్టిన లింకు కెనాల్ ఏదైతే ఉందో దాని ద్వారా వీపనగండ్ల చిన్నంబావి మండలాల రైతులకు ఇబ్బందులు కలగకుండా సాగునీరు పుష్కలంగా అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కాలువ నిర్మాణం ఆరు నెలల్లో పూర్తి చేసుకొని రిజర్వాయర్లో నీళ్లు పడే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అంతేగాక ఈ లింకు కెనాల్ లో భూములు కోల్పోతున్నటువంటి రైతులు నర్సాయిపల్లి బొల్లారం వల్లభాపురం సంగినేనిపల్లి కలవరల్ల తదితర గ్రామాల రైతులకు ఎకరా 11 లక్షల వరకు నష్టపరిహారం చెల్లించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అయితే ప్రభుత్వం ద్వారా తక్కువ రేటు రైతులకు అందడం జరుగుతుందని దాన్ని రెట్టింపు చేసి ఇవ్వాలి అని కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి ఆయన ఈ విషయం వెల్లడించడం జరిగింది ల్యాండ్ ఆక్యుయేషన్ కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు రైతులు పెట్టుబడి కోసం రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఈనెల ఆఖరిలో రైతుబంధు పథకాన్ని అమలుచేసి ఎకరాకు ఆరువేల రూపాయల చొప్పున రైతు ఖాతాలలో వేయడం - మిగతా3లో..

పీయూలో ముగిసిన

# టీజీపీ ఈసెట్ ఎంపికలు

- హాజరైన జేఎన్టీయూహెచ్ రిటైర్డ్ ప్రొఫెసర్ వై గోపికృష్ణ



జేఎన్టీయూహెచ్ రిటైర్డ్ ప్రొఫెసర్ వై గోపికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్14, ప్రభాతవార్త :** పాలమూరు విశ్వవిద్యాలయంలో టిజిపి ఈసెట్ ఎంపికలు నాలుగో రోజు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ వేడుకలకు జేఎన్టీయూహెచ్ రిటైర్డ్ ప్రొఫెసర్ వై గోపికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసికదృఢత్వంతో పాటు శారీర దృఢత్వం అవసరమని,ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను కెరీర్ ఎంచుకున్న వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.వీసీ ఆచార్య జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడురోజులుగా టిజిపి ఈసెట్ ఎంపికలు చాలా పారదర్శకంగా జరిగాయని,చివరిరోజున మిగిలిన మహిళాఅభ్యర్థులకు ఎంపికలు ఉంటాయన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, వెంకట్‌రెడ్డి,మాజీఉపకులపతి ఆచార్య లక్ష్మికాంత్ రాథోడ్,సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్, ఫీజికల్ డైరెక్టర్ డా శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 856గైర్హాజరు..

పాలమూరు యూనివర్సిటీలో మహిళా అభ్యర్థులకు టీజీపీ ఈ సెట్ ఎంపికలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం బిపెడ్‌లో 412మంది విద్యార్థులకు గాను -మిగతా3లో..

---




# రగులుతున్న రగడ..

- ఫ్యాక్టరీని మూసివేయాలని గ్రామాల రైతులు,స్థానికుల డిమాండ్
- మిల్లు ఎదుట గ్రామస్తులు,రైతుల ఆందోళన
- రంగంలోకి దిగిన పోలీసులు..

ఆందోళనను తీవ్రతరం చేస్తామంటున్న రైతులు

**భూత్పూర్,జూన్ 14,ప్రభాతవార్త :** కొత్తమొల్గర పేపరు మిల్లు రగడ రోజురోజుకు రగులుతోంది.మిల్లు నుంచి వెలువడే వ్యర్థపు నీరు కాలువలా పారి పక్కనే ఉన్న సుడిచెర్వులో కలుస్తుండడంతో వేలాది చేపలు మృత్యువాత పడ్డాయి.దీంతో రెచ్చిపోయిన రైతులు,మత్స్యకారులు కాలుష్యాన్ని వెదజల్లే పేపరు మిల్లు ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పాత, కొత్త మొల్గర, మద్దిగట్ల, పాత,కొత్త కప్పెట, మొహ్మదుస్సేన్‌పల్లి,అల్మాయపల్లి,రావులపల్లి గ్రామాలకు చెందిన రైతులు గడిచిన వారం రోజులుగా అలుపెరగని ఆందోళన చేస్తున్నారు.న్యాయమైన రైతుల డిమాండ్లకు మద్దతుగా మీడియా సహకరిస్తుండడంతో చెర్వు కింద



కొత్తమొల్గర పేపరు మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

జీవనం సాగించే రైతులు ఫ్యాక్టరీ ముందు ఆందోళనకు దిగారు.తాజాగా శనివారం ఆయా గ్రామాలకు చెందిన దాదాపు యాభై మంది రైతులు కాలుష్యాన్ని వెదజల్లే ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తు పెద్ద ఎత్తున మిల్లు ముందు ఆందోళనకు దిగారు.విషయం ఫ్యాక్టరీ మేనేజర్ సంబంధిత భూత్పూర్ పోలీసులకు సమాచారమందివ్వడంతో విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనను కొద్ది



ఫ్యాక్టరీ యాజమాన్యంతో వాగ్వాదానికి దిగిన రైతులు

సద్దుమణిగేలా చేశారు.ఫ్యాక్టరీని మూసివేసేవరకు తమ ఆందోళన ఆగదని రైతులు స్పష్టం చేస్తున్నారు.కనీసం ఈ మూణ్నెళ్లు వర్షాకాలంలోనైనా మిల్లును మూసివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.ఫ్యాక్టరీ నుంచి వచ్చిన వ్యర్థపు నీరు చెర్వులోని ఓ చిన్న కుంటలోకి వెళ్లి నిండు కుండను తలపిస్తోందని,వర్షం పడితే వర్షం చినుకులు తోడై వరదలా పారి వ్యర్థపు మురుగు నీటిలో కలిపి చెర్వులో కలిసే ప్రమాదముందని,వెంటనే చెర్వు శిఖంలో పోగయిన వ్యర్థపు కాలుష్య నీటిని వెంటనే త్తివేయాలని,లేకుంటే తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. రెండ్రోజుల్లో మురికినీటి కుంటను ఎత్తివేయకుండా వర్షం నీరు తోడై ఈ కలుషిత,వ్యర్థపు రసాయానాలు కలిసిన నీరు చెర్వులోకి వెళ్లి వేలాది మత్స్యసంపదను హరింపజేస్తాయని పలువురు రైతులు,మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సోమవారం వరకు సమస్య పరిష్కారం కాకుంటే మంగళవారం నుంచి ఫ్యాక్లరీ ముందు ధర్నా చేపడతామని రైతులు చంద్రశేఖర్,శ్రీనివాస్‌రెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డిలతో పాటు మాజీ వైఎస్ ఎంపిపి నరేష్‌గౌడ్‌లతో పాటు పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఓపెన్ ప్లాట్లు, రైతుల పొలాలే

# మందుబాబులకు అడ్డాలు

- తాగి పొలాల్లో సీసాలు వేస్తున్నారని రైతుల అవేదన
- పగిలిన సీసా ముక్కలు కాళ్ళకి గుచ్చుకుంటున్నాయి
- గ్రామాల్లో బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మందు అమ్మకాలు



పగులకొట్టి పడవేసిన మందు సీసాలు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 14 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో గత కొన్ని రోజుల నుండి రైతులకు పంటలు వేసుకొనేందుకు వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు పొలాల్లో విత్తనాలు నాటేందుకు సిద్ధం అవుతున్నారు. కానీ ఇన్ని రోజులుగా బీడుగా ఉన్న భూములు మందు బాబులకు ఓపెన్ ప్లాట్‌లు, వెంచర్‌లు అడ్డాగా మారిపోయాయి. కొంత మంది తాగిన మైకంలో వారిలో ఉన్న వికృత చేష్టలు బయటకు వచ్చి తాగిన మందు -మిగతా3లో..

### విద్యా రంగాన్ని వ్యాపారంగా మారుస్తున్న

# ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు

**పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల**

**అమ్మకాలలో ఎవరి వాటా ఎంత ?**

**నిద్రావస్థలో సంబంధిత అధికారులు.**


విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్

**జడ్చర్ల (బాలానగర్) జూన్ 13 ప్రభాతవార్త :** ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యా రంగాన్ని వ్యాపార రంగంగా మార్చేశాయి. బాలానగర్ మండలంలోని అనేక ప్రైవేటు పాఠశాల యజమానులు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను స్వయంగా పాఠశాల యాజమాన్యాలు తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టపగలే ప్రైవేటు పాఠశాల యజమానులు చేస్తున్న దోపిడీని విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేయడమే కాకుండా అధిక ధరలకు పుస్తకాలను విక్రయించి మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరిచేస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కనీస విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులు లేరని, క్రీడా ప్రాంగణాలు, సరియైన మరుగుదొడ్లు వంటి కనీస వసతులు ఏవి లేవన్నారు. పదో తరగతి, ఇంటర్ చదివిన వారికి తక్కువ వేతనాలు ఇచ్చి వారితో విద్యా బోధన చేయిస్తున్నారన్నారు. అగ్గిపెట్టె లాంటి ఇరుకు గదులలో విద్యార్థులను కూర్చోబెట్టి చీకట్లో పాఠాలు చెబుతూ విద్యార్థుల కంటి దృష్టి కోల్పోయేటట్లు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్ నెస్ సర్టిఫికెట్లు కూడా ఉండడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలల యజమానులు చేస్తున్న దోపిడీని విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ ఘటనపై ఎంఈఓ శంకర్ నాయక్‌ను వివరణ కోరగా సోమవారం పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యాశాఖ అధికారులు మండలంలోని ప్రైవేటు పాఠశాలలను సందర్శించి, అనుమతి లేని, నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## కాలువ వెంబడి ఉన్న చెట్లను తొలగించాలి

**మండల రైతుల డిమాండ్**


ఎంజిఎల్ఐ కాలువల వెంబడి పేరుకుపోయిన చెట్ల పొదలు

**ఉప్పునుంతల,జూన్14 ప్రభాతవార్త :** మహాత్మ గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద మండలంలో సాగునీరు అందించే కాలువల వెంబడి నిండ చెట్ల పొదలు పేరుకుపోయాయి. కాలువ నిర్మాణం చేపట్టిన నుంచి నేటి వరకు సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం, కాలువ వెంబడి చెట్ల పొదలు పేరుకుపోవడంతో కాలువల వెంబడి సాగు నీరు వచ్చిన అనుకున్నంత వేగంగా పారే అవకాశాలు లేకుండా పోలేదు. కాలువల వెంబడి పేరుకపోయిన చెట్ల పొదలను తొలగించాలని,భారీ నీటిపారుదల శాఖ అధికారులు కాలువల వెంబడి ఏనాడూ కన్నెత్తి చూడకపోవడంతో కాలువలు ఏ విధంగా నీరు పారుతున్నాయి. పేరుకు పోయిన చెట్ల పొదల పరిస్థితి ఎలా అని ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భారీ నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి సాగునీరు అందిస్తున్న మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువల వెంబడి పేరుకపోయిన చెట్ల పొదలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

## టాస్క్ ఫోర్స్ దాడులలో టిప్పర్‌ల పట్టివేత


టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో శనివారం టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులలో టిప్పర్‌ల పట్టివేత జరిగింది. మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 02 టిప్పర్‌లు ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 03 టిప్పర్‌లు మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 02 టిప్పర్‌లు అక్రమంగా ఇసుక తరలిస్తుంటే టాస్క్‌ఫోర్స్ మరికల్ పోలీసులు దాడులు నిర్వహించి 02 టిప్పర్‌లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన మన్నె రమేష్ చాకలి శివకుమార్, డ్రైవర్, ఓనర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మరికల్ ఎస్సై రాము తెలిపారు. ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు టిప్పర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుంటే టాస్క్ ఫోర్స్, ధన్వాడ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ చాకలి నరేష్ తిప్రస్‌పల్లి, ఓనర్ అరుణ్, రాములు, డ్రైవర్ తిమ్మప్ప మాగనూరు, ఓనర్ మహేష్ గౌడ్ నేరేడ్గం, డ్రైవర్ నాగరాజు శక్తి నగర్, రైచూర్, ఓనర్ వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాగనూరు. డ్రైవర్, ఓనర్లపై ధన్వాడ ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ

**అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**


నివాళులర్పిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల,జూన్ 14 ప్రభాతవార్త :** మృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని,కుటుంబ సభ్యులు అధైర్య పడవద్దని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు,నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ భరోసా కల్పించారు. మండలంలోని ఈరట్వాన్ పల్లి గ్రామానికి చెందిన గున్నమోని నారాయణ శనివారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీ కృష్ణ స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, వెల్టూరు మాజీ ఎంపీటీసీ రెడ్డి రెడ్డి రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

**పెనిమిళ్ళలో..**మండలంలోని పెనిమిళ్ళగ్రామానికి చెందిన అల్లేసత్యనారాయణ తల్లి చనిపోవడంతో శనివారం తెలంగాణ రాష్ట్రకాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ సతీమణి డా. చిక్కుడు అనూరాధ మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డిలు ఉన్నారు.

## చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

**శ్రీరంగాపూర్, జూన్ 14 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన షౌకత్ అలీ (ఆర్టీసి డ్రైవర్) 06.06.2025 రోజు అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. తన చిన్ననాటి మిత్రులు(1991,92 ఎస్ఎస్‌సి బ్యాచ్) తనతో కలిసి ఆడి పాడిన స్నేహితులు షౌకత్ అలీ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తల ఒక చేయి వేసి మేమున్నామంటూ ముందుకు వచ్చి ఆ కుటుంబానికి రూ. 50,000=00 ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అందరూ ఆ కుటుంబానికి, భార్య, కూతురుకు మేమున్నామంటూ భరోసా, ధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. షౌకత్ అలీ మన మధ్య లేకపోయినా మేమంతా నీ కొడుకులమే అని తన తల్లికి ధైర్యాన్ని నింపారు. చదువుకునే రోజుల్లో ఉపాధ్యాయులు చెప్పిన మాటలు సాటివారితో సోదర భావంతో మెలగాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి, మనకు తెలిసిన జ్ఞానాన్ని పదిమందికి పంచాలి, మంచితనాన్ని పెంచి పోషించాలి అనేటువంటి మాటలకు యధార్థ రూపం వీరి చేసినటువంటి సహాయం అని పలువురు అభినందించారు. కార్యక్రమంలో బుచ్చన్న, కురుమయ్య, మాజీ ఎంపిటిసి ఎల్లస్వామి,శాంతి భూషణ్, అరుణ, మేదమ్మ, రజియా, చెన్నయ్య, జలీల్, కృష్ణ,విష్ణు, మన్యం, చంద్రశేఖర్, నిరంజన్, రామకృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రి ఏర్పాటు చేసేవరకు

# ఆందోళన కొనసాగిస్తాం

**దీక్ష విరమణలో బిజెపి నేతలు**


దీక్ష విరమింపజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఆస్పత్రిని తరలించడాన్ని నిరసిస్తూ వెంటనే జిల్లా కేంద్రంలో అన్ని రకాల చికిత్సల కోసం ఆస్పత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బిజెపి నాయకులు చేపట్టిన 24 గంటల నిరాహార దీక్ష శనివారం ఉదయం 10 గంటలకు విరమించారు. దీక్షను బిజెపి రాష్ట్ర నాయకులు కే. రతంగ్ పాండురెడ్డి, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షులు లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ దీక్షలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ, జిల్లా బిజెపి అద్యక్షుడు సత్య యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కేంచే శ్రీనివాసులు, బిజెపి జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు, బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్ , జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ , ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నాయకులు కిరణ్ దగే,రాఘవేంద్ర,రఘునాథ్ ,రఘు లకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ, రతంగ్ పాండు రెడ్డి,సత్య యాదవ్ మాట్లాడుతూ జిల్లా ప్రజల వైద్యం కోసం ఎన్ని పోరాటాలకు అయినా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో ఆస్పత్రి ఏర్పాటు చేసి వైద్యం అందించాలని తాము చేస్తున్న ఆందోళన ఆరంభం మాత్రమేనని అన్నారు. ఆస్పత్రి ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. తమ దీక్షకు మద్దతు పలికి అండగా నిలిచిన పట్టణ ప్రజలకు,సంఘీభావం తెలిపిన కుల సంఘాలు, వ్యాపారులు, యువకులు,మహిళలు,న్యాయవాద, ఆర్‌ఎంపి సంఘాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల పట్టాలిచ్చారు.. అప్పులపాలు చేయడానికేనా..

**పత్రికా మిత్రుల సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బిజెపి నాయకులు**


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**పెబ్బేరు, జూన్ 14 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంతో పాటు మండలంలోని లబ్ధిదారులు ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఇందిరమ్మ పట్టలిచ్చారు. అకౌంట్లలో డబ్బులు జమ చేయకుండా ఇళ్ల కట్టుకోవాలని చెప్పి వారిని అప్పులపాలు అయ్యేలా చేశారని బీజేపీ నాయకులు విమర్శించారు. శనవారం పెబ్బేరులో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. లబ్ధిదారుల అకౌంట్లలో ఏమాత్రం డబ్బులు వేయకుండా పట్టాలిచ్చిన వెంటనే 45 రోజులలోపు ఇళ్ల కట్టుకోవాలని చెబుతుండటంతో వారు అప్పుల కోసం నానా తిప్పలు పడుతున్నారని అన్నారు. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని చెప్పారని వానలు స్టార్ట్ అయితే ఆ ఇసుకను తోడకుండా ఆపేది కూడా ప్రభుత్వమే అని అన్నారు. సరిగ్గా వర్షాలు స్టార్ట్ అయ్యే సమయానికి పట్టాలిచ్చి ఇల్లు కట్టుకోమని చెప్పి కట్టుకోకపోతే డబ్బులు ఆపవచ్చని జనాలను మోసం చేస్తున్నారన్నారు. మొదలు అబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసి వారిని అప్పులపాలు చేయకుండా చూడాలని డిమాండు చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 ను తమ పథకంగా చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మున్సిపాలిటీలో ఎక్కడి సమస్యలు అక్కడ తిష్ట వేశాయని, వారం రోజులకోసారి కూడా మురుగును తీయడం లేదని చెప్పారు. పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. 11 ఏళ్ల మోదీ పాలన విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా వికసిత్ భారత్ అమృత్ కాల్ పేరిట కార్యక్రమాలను చేయనున్నామని పేర్కొన్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను, ఆపరేషన్ సింధూర్, పై విషయాలన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెబ్బేరు టౌన్ అధ్యక్షుడు క్రాంతి కుమార్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ హేమారెడ్డి, నాయకులు ఆంజనేయులు, రంగ గౌడ్, సర్వేశ్వర్, శ్రీకాంత్,సాయి, గోనెల అరవింద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బకాయి పెండింగ్ విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**ఈనెల 17న హైదరాబాదులో రజక సంఘం ఆధ్వర్యంలో మహా ధర్నా**


చలో హైదరాబాద్ మహా ధర్నా
కరపత్రాన్ని విడుదల చేస్తున్న రజక సంఘం నాయకులు

**ఖిల్లాగణపురం,జూన్ 14, ప్రభాతవార్త:** కులవృత్తులైన రజక నాయి బ్రాహ్మణులకు చెందిన ఉచితవిద్యుత్తుపథకం బకాయి బిల్లులు ప్రభుత్వంవెంటనే చెల్లించాలని విద్యుత్ అధికారుల వేధింపులను ఆపాలని జిల్లారజక సంఘం అధ్యక్షులు విజయ్ అన్నారు.శనివారం మండల కేంద్రంలో హలో రజక చలో హైదరాబాద్ ఈనెల 17వ తేదీన ఇంద్రపార్క్ దగ్గర జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక మరియు నాయి బ్రాహ్మణ వృత్తిదారుల ఉచిత విద్యుత్తు పథకం బకాయి బిల్లులను చెల్లించాలని అధిక బిల్లులను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు మరియు ఈ పథకాన్ని కేటగిరి ఎల్.టి 2 నుండి ఎల్ టి 4కేటగిరీకి మార్చాలని అదేవిధంగా మండల కేంద్రాలతో పాటు మున్సిపాలిటీలలో మోడ్రన్ ధోబి ఘాట్లు నిర్మించాలని కోరారు కులవృత్తుల వారికి జీవో నెంబర్ రెండు ప్రకారం 250 యూనిట్ల ఉచితవిద్యుత్‌పథకం ద్వారా సుమారు ఒక లక్ష 12,586 మందికిపైగా విద్యుత్ కనెక్షన్ ఉన్నాయని కానీ గత ఏడాది కాలంగా ఉచిత విద్యుత్తుపథకానికి రజకులకు 187కోట్లు నాయి బ్రాహ్మణులకు 43 కోట్ల పెండింగ్ బకాయి బిల్లులు బడ్జెట్లో ప్రభుత్వం విద్యుత్ శాఖకు సకాలంలో చెల్లించడం లేదని అట్టి పెండింగ్ బిల్లులు వేలాదిగా పెరిగిపోతుండడంతో విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో పట్టణాల్లో వెంటనే బిల్లును చెల్లించాలని తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారని అక్కడక్కడ వారి కరెంటు కనెక్షన్లను కూడా కట్ చేస్తున్నారని ఒక్కో వృత్తిదారుడికి 60నుంచి 70 వేల వరకు కరెంట్ బిల్లులు పెండింగ్లో ఉన్నాయని వాటికి ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేసి ఆదుకోవాలని కోరారు. పెండింగ్ బిల్లులు మాఫీ చేయాలని ఈనెల 17న హైదరాబాదు లోని ఇందిరా పార్క్ దగ్గరమహా ధర్నా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నాకు జిల్లాలోని అన్ని గ్రామాల నుండి రజకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం తిరుపతయ్య దేవరకొండ బాలస్వామి కుంచారపు బాలస్వామి పెద్దాపురం శ్రీనివాసులు కుంచారపు శ్రీనివాసులు రమేష్ శివ పెంటమ్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**మక్తల్ టౌన్, జూన్ 15 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో భారతదేశం గత పదకొండు సంవత్సరాలుగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని భాజపా నియోజకవర్గ ఇంఛార్జి కర్నిస్వామి అన్నారు. శనివారం సంగంబండ గ్రామంలో జరిగిన 11 ఏళ్ల బాజాపా పాలన అభివృద్ధి ఫలాలు, భాజపా గ్రామీణ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 60 ఏళ్ల కాంగ్రెస్ అవినీతి పాలన చమరగీతం పాడి గత 11 ఏళ్లుగా మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. దేశ రక్షణలో ఆపరేషన్ సింధూర్ లాంటి సైనిక చర్యతో దేశ ప్రజల మన్ననలను చూరకొన్నారని, ఆర్టికల్ 370 రద్దు, రైతులకు మద్దతు ధర అందించడం, డబల్ ఇంజన్ సర్కార్లతో దేశ ప్రజలకు సుస్థిర పాలన అందించారని కొనియాడారు. భాజాపా మక్తల్ మండల గ్రామీణ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా భాజపా అందించిన సుపరిపాలన ఫలితాలను ప్రతి కార్యకర్త ఇంటింటికి చేరవేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో భాజపా మక్తల్ మండల గ్రామీణ కార్యవర్గం బాధ్యతలను స్వీకరించింది. ఈ సందర్భంగా భాజపా నాయకులు బలరామ్ రెడ్డి మాట్లాడుతూ కొత్త అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం సమిష్టిగా పనిచేసే మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయానంద్ రెడ్డి, వెంకట్ రాములు, చీరాల సత్యానారాయణ, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ సాగర్, స్వాగత్ సత్యానారాయణ, ప్రసన్న, రంగారెడ్డి, లక్ష్మీపతి యాదవ్, లింగప్ప, మండల కమిటీ సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంఛార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్వామిని దర్శించుకున్న ఎస్ఐ దంపతులు



**మల్దకల్ జూన్ 14. ప్రభాతవార్త :** మల్దకల్ మండల కేంద్రంలో స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి శనివారం పెంట్లవెల్లి ఎస్సై రామన్ గౌడ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్న వీరికి ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు ప్రత్యేక పూజలు జరిపించి వారికి సన్మానించారు.ఈకార్యక్రమంలో గౌడసంఘం నాయకులు నారాయణగౌడ్,మురళీధర్‌గౌడ్,ధర్మేష్‌గౌడ్,వీరన్నగౌడ్ ఆంజనేయులు గౌడ్ వెంకటేష్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఫోటోగ్రాఫర్‌కు ఆర్థిక చేయూత

**ఆత్మకూర్ జూన్ 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఫోటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు కుటుంబానికి ఆత్మకూర్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రోజు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని తిప్పడం పల్లి గ్రామానికి చెందిన నాగరాజు గత కొన్ని సంవత్సరాలుగా ఫోటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్నప్పటికీ గత నెలలో అకాల వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోవడంతో ఆత్మకూరు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో నాగరాజుకు ఆర్థిక సహాయం అందజేసినట్లుగా ఆత్మకూర్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మన్యం ఉపాధ్యక్షులు శ్రీరాములు తదితరులు తెలిపారు ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆర్థికంగా చితికిపోయిన ఫోటోగ్రాఫర్లకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు..

### కారు, బస్సుఢీ .. తప్పిన ప్రమాదం

**నారాయణపేట టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామం వద్ద శనివారం జాజాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి కారు నారాయ ణపేట ఆర్టీసీ బస్సును ఢీ కొట్టుకోవడంతో కారు కొంత డ్యామేజ్ జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### నేడు లోకుర్తి గ్రామంలో

### ఉచిత కంటి వైద్య శిబిరం

**నారాయణపేట టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం లోకుర్తి గ్రామంలో నేడు జిల్లా అంతత్వ నియంత్రణ సంస్థ మహబూబ్‌నగర్ జిల్లా వైద్యశాఖ అధికారి నారాయణ పేట డివిజన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు జయశ్రీ మెడికల్ జనరల్ స్టోర్ నర్సాపూర్ రోడ్డు వద్ద నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరం ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం 1:00 వరకు కొనసాగుతుందన్నారు. శిబిరానికి వచ్చేవారు ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు,లేదా ఏదైనాగుర్తింపుకార్డుతో రావాలన్నారు. ఇట్టి అవకాశాన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### డయల్ యువర్ డిఎంకు విశేష స్పందన

**డిపో మేనేజర్ లావణ్య**



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 14 ప్రభాతవార్త :** నారాయణపేట డిపో మేనేజర్ లావణ్య శనివారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించగా విశేష స్పందనతో పాటు 20 వినతులు వచ్చినట్టు తెలియజేశారు. వాటి లో కోస్గి నుండి నారాయణపేటకు ఉదయము 5:30 గం.లకు అదనపు ట్రిప్పు నడపాలని,క్యాతన్‌పల్లి నుండి లక్ష్మీపల్లి వరకు ఉదయం సాయంత్రం స్కూల్ ట్రిప్ వేయాలని బూనీడు నుండి కోస్గివరకు స్కూల్ ట్రిప్పు వేయాలని నారాయణపేట నుండి కోట కొండ తిరుమలపురంకు మధ్యాహ్నం ట్రిప్పు వేయాలని బిజ్వార్ నుండి ధన్వాడ వరకు బిజ్వార్ నుండి మక్తల్ వరకు బస్సు నడపాలని, ఉదయం తాండూర్ నుంచి కొడంగల్, రావుల్‌పల్లి, మద్దూర్ నుండి నారాయణపేట వరకు ఉదయం బస్సు నడపా లని, కోస్గి నుండి రాత్రి 8:00 గం.లకు నారాయణ పేట వరకు వేయాలని, కోస్గి నుండి గుల్బర్గాకు బస్సు నడపాలని , మక్తల్ నుండి గద్వాల్ వరకు మక్తల్ నుండి ముష్టిపల్లి వెళ్లే మక్తల్ నుండి రాత్రి 6:30 నుండి 7:30కి మార్చాలని వివిధ సమస్యల వచ్చిన ప్రయాణికుల నుండి వచ్చిన వినతులు నమోదు చేసుకోవడం జరిగింది త్వరలోనే పై అధికారులతో దృష్టికి తీసుకుని వెళ్లి చర్యలు జరుపుతానని తెలిపారు.

### పేద విద్యార్థులకు ఫీజులో రాయితీ



**వనపర్తి,జూన్14 ప్రభాతవార్త:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వనపర్తి వారి చొరవతో, కొత్తకోట మండలంలోని బెస్ట్ గ్రామర్ స్కూల్ కరెస్పాండెంట్ జావిద్,వారి పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థిని అయిన నిత్యశ్రీ 4వ తరగతి విద్యార్థినికి, పదవ తరగతి వరకు ఉచిత విద్యను అందజేస్తామని తెలిపారు. అంతేకాకుండ, రుద్ర అనబడే మరొక విద్యార్థికి కూడా, ఫీజులో 50 రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ వారు, స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపి పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం గొప్ప అవకాశం అని అన్నారు. ఉచిత విద్యను అందించడం అభినందనీయమని అన్నారు.అనంతరం కరస్పాండెంట్ జావేద్‌ను శాలువాతో సన్మానించారు.

## రాబోయే స్థానిక సంస్థలో విజయం సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి పి. విశ్వనాథన్, పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు

**నారాయణపేట,జూన్ 14 ప్రభాతవార్త :** శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరు కష్టపడి కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు ముఖ్యనాయకులు కృషి చేయాలని ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్రపార్టీ కో ఇంచార్జ్ మాజీ పార్లమెంట్ సభ్యులు పి.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొని అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రాహుల్ గాంధీ సూచన మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేదిశగా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే నేడు నేను ఆకస్మిక జిల్లా సమావేశంలో పాల్గొనటం జరిగిందని తెలిపారు. ఈనెల 25 తేదీలోపు అన్ని మండల, బ్లాక్, గ్రామ అధ్యక్షుల నియమాకాలను పూర్తి చేయాలని పరిశీలకులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ పదవులు,నామినేటెడ్ పోస్టులలో తప్పకుండా అవకాశం ఇస్తామన్నారు. పార్టీ అభ్యర్థులు ఓడిపోతే డిసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు,పార్టీ ఇంచార్జిలదే భాద్యతన్నారు. కావున వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను అందరు కూడా ఛాలెంజ్ గా తీసుకోని పని చేయాలని కోరారు. జై బాపు జై భీమ్ జై సంవిధన్ కార్యక్రమంను అన్ని మండలాల్లో త్వరగా పూర్తి చేయాలని కోరారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా వారితో విడి విడిగా సమావేశం అయ్యారు. పార్టీలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పార్టీ పదవులు,నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నుండి వచ్చిన జిల్లా పరిశీలకులు వేణు గౌడ్, సంధ్యారెడ్డి, ధారసింగ్ నాయక్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల, విజయ్ కుమార్,పేట ఏఎంసి చైర్మన్ శివారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, పట్టణ అధ్యక్షులు ఎండి.సలీం, జిల్లా ఉపాధ్యక్షులు జి. శివకుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, సుధాకర్, మనోహర్ గౌడ్,సరాఫ్ నాగరాజు,వివిధ మండలాల అధ్యక్షులు నరహరి, రఘువర్ధన్ రెడ్డి, నర్సింహా,వీరన్న, విగ్నేశ్వర్ రెడ్డి, గణేష్, శ్రీనివాస్ రెడ్డిలతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## నీట్ ప్రవేశ పరీక్షల్లో స్కాలర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

**వనపర్తి ప్రతినిధి, జూన్ 14 ప్రభాతవార్త:** నీట్ 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలలో వనపర్తి స్కాలర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం ప్రకటించిన ఈ ఫలితాలలో స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి మెడిసన్ సీట్లు ఖాయం చేసుకున్నట్లు స్కాలర్స్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. రెగ్యులర్ ఇంటర్‌తో పాటు మొదటి ప్రయత్నంలోనే షాహిస్తా తహినియత్ 545 మార్కులు, కె.మహేందర్ 415 మార్కులు, టి.ప్రవంత్ రెడ్డి 393 మార్కులు జాతీయ ప్రవేశ పరీక్షలో కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కాలర్స్ కళాశాల యాజమాన్య సభ్యులు శాలువ, పూలబొకేతో సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు, తాము చదివిన విద్యా సంస్థలకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో డా పి. జగదీశ్వర్, డా.జి.వరప్రసాదరావు, డా బి.నాగేశ్వర్‌రెడ్డి, డా.ఎల్.సత్యనారాయణ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్స్ ఎ.శ్రీధర్, బి.మధుసూదన్ గుప్త, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజా మార్గం

◆ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం ◆ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

**వనపర్తి క్రైమ్, జూన్ 14 ప్రభాతవార్త :** రాష్ట్ర హైకోర్టు ఆదేశాలనుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టుతో పాటు ఆత్మకూరు కోర్టులలో లోక్ అదాలత్ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి ఎంఆర్ సునీత మాట్లాడుతూ కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాజీమార్గమే రాజా మార్గమని రాజి కుదుర్చుకోవడం వల్ల ఇరువర్గాలు సంతోషంగా ఉంటారని కక్షలు కార్పన్యాలు లేకుండా సుఖసంతోషాలతో జీవనం సాగించవచ్చని పేర్కొన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవ అధికార కార్యదర్శి వి.రజని మాట్లాడుతూ లోక్ అదాలత్ అనేది కక్షిదారులకు గొప్ప అవకాశమని సంవత్సరాలపాటు కోర్టుల చుట్టూ తిరగకుండా కేసులు పరిష్కరించుకోవచ్చని అవకాశాన్ని కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకొని వారి కేసులను వివాదరహితంగా రాజీవ్ కుదుర్చుకోవాలని అన్నారు. జూన్ 14న నిర్వహించిన లోక్ అదాలత్‌లో ప్రీ లిటిగేషన్ కేసెస్ 5,600, సివిల్ కేసెస్ 15, క్రిమినల్ కేసులు 2552 కేసులు. మొత్తంగా 8167 కేసులు పరిష్కరించబడ్డాయి. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**నారాయణపేట టౌన్, జూన్ 14 ప్రభాతవార్త:** విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు కొత్త పిఆర్సిని ప్రకటించి అమల్లోకి తీసుకురావాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మక్తల్ అధ్యక్షుడు బి.గోపాలం అన్నారు. ప్రతినెల రెండవ శనివారం నిర్వహించే విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని శనివారం మక్తల్ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం బకాయి ఉన్న ఐదు డిఏలలో ఒక డిఏను మాత్రమే మంజూరు చేయడం అన్యాయం అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు బకాయిలన్నీ తక్షణమే నగదు రూపంలో చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన వారికి రావలసిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భాస్కర్, సంజన్న, సూర్యప్రకాష్, తులసప్ప, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, అరుణ, సుజాత, నరసమ్మ, దేవేంద్రప్ప, సురేందర్, రాములు, పాషా, తిప్పన్న, కిష్టయ్య గౌడ్, జగదీష్, మల్లికార్జున్, సయ్యద్, మౌలానా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ మిల్లుపై భూత్పూర్ పీఎస్‌లో కేసు నమోదు




కొత్తమొల్గర శివారులోని శ్రీవెంకటేశ్వర ఇండస్ట్రీస్ పేపర్ మిల్లు కంపెనీ

**భూత్పూర్,జూన్ 14,ప్రభాతవార్త:** కొత్తమొల్గర శివారులో నెలకొన్న శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ పేపర్ మిల్లు వల్ల వ్యర్థాల కాలుష్యం వల్ల దగ్గర్లో ఉన్న సుడి చెర్వులో కలుస్తుండడంతో చెర్వులో ఉన్న చేపలతో పాటు భూగర్భజలాలు కలుషితమై చెర్వుపై ఆధారపడిన రైతులు,పశువులు అనారోగ్యం పాలవుతున్నారని పలువురు రైతులు గడిచిన మూడ్రోజులుగా ఫ్యాక్టరీ ముందు ఆందోళనకు దిగారు.ఈ విషయమై వార్త దినపత్రిక శనివారం నాటి ఎడీషన్‌లో 'కాలుష్య కోరల్లో సుడి చెర్వు' అన్న ప్రధాన టైటిల్‌తో రైతులు,ఇరిగేషన్ ఏఈ,ఫ్యాక్టరీ మేనేజర్ అభిప్రాయాలతో ప్రధానంగా వార్తను ప్రచురించిన సంగతి పాఠకులకు విధితమే.ఇందుకు స్పందించిన మండల పరిషత్ అధికారులు,పోలీసులు శనివారం క్షేత్రస్థాయిలో ప్రాథమిక దర్యాప్తు జరిపి ఫ్యాక్టరీ వెదజల్లే కెమికల్ వాటర్ వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రం కావడంతో పాటు చెర్వులోని చేపలు మృత్యువాత పడడంతో పాటు చెర్వు నీటిని ఉపయోగించే పశువులు తరచూ అనారోగ్యం పాలు కావడాన్ని గుర్తించిన అధికారులు పేపర్ మిల్లుపై చర్యలకు సిద్ధమయ్యారు.ఇందులో భాగంగానే శనివారం ఎంపిపి కార్యాలయ తరఫున పంచాయతీ సెక్రటరీ గంగా సునీత కాలుష్యానికి కారణమైన పేపర్ మిల్లుపై భూత్పూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.పంచాయతీ సెక్రటరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్14, ప్రభాతవార్త:** నవోదయ స్కూల్,బస్ టెర్మినల్,యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాల, ఐఐటి ఏర్పాటు కోసం శనివారం కలెక్టర్ విజయేందిర బోయి జడ్చర్ల మండలం పెద్దాయి పల్లి, మహబూబ్ నగర్ రూరల్ మండలం ప్రభుత్వ మెడికల్ కళాశాల తిరుమల హిల్స్,మహబూబ్ నగర్ బై పాస్ తదితర ప్రాంతాల్లో పలు ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట అర్.డి. ఓ.నవీన్, బాలా నగర్ తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి,మహబూబ్ నగర్ డి.టి.దేవేందర్ తదితరులు ఉన్నారు.

## పీయూలో ముగిసిన టీజీపీ ఈసెట్ ఎంపికలు

మొదటి పేజీ తరువాయి భాగం..

311మంది విద్యార్థులు హాజరయ్యారని, 101 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అదేవిధంగా డీపెడ్‌కోర్స్ లో 154మంది విద్యార్థులకుగాను 86 మంది విద్యార్థులు హాజరయ్యారని,68మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్ తెలిపారు. పీయూలో ప్రశాంతంగా ముగిసిన టీజీపీ ఈ సెట్ ఎంపికలు. పాలమూరు యూనివర్సిటీలో నాలుగు రోజులపాటు కొనసాగిన టీజీపీ ఈ సెట్ ఎంపికలలో బి పెడ్, డి పెడ్ కోర్స్ లలో అడ్మిషన్స్ కొరకు మొత్తం 2608 మంది విద్యార్థులకు గాను 1752 మంది విద్యార్థులు హాజరయ్యారని, 856 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఒక ప్రకటనలో సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్ గారు తెలిపారు.

## ఓపెన్ ప్లాట్లు, రైతుల పొలాలే మందుబాబులకు అడ్డాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

సీసాలు పొలం గట్లపై ఎక్కడ బడితే అక్కడ పగలగొట్టి పడవేయడంతో రైతులు పొలాల్లో పనిచేసే సమయాల్లో కూలీలకు, రైతులకు బీరు, మందు సీసా ముక్కలు కాళ్లకు గుచ్చుకొంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలైన పశువులు, ఆవులు, గొర్రెలు, మేకలు ఇతర జంతువులకు సీసాలు గుచ్చుకొని రక్తం కారుతుంటే బాధగా అనిపిస్తుందని రైతులు వాపోతున్నారు. రైతులకు చాలా ఇబ్బందిగా మారింది. రైతులు నాగళ్ళతో భూమి దున్నుతున్న సమయంలో కాళ్లకు మద్యం సీసాలు గుచ్చుకొని రక్తస్రావం అవుతున్నాయని అంటున్నారు. కొంతమంది రైతులు పంట పొలాల్లోని మద్యం సీసాలను ఏరివేసి భూమి చదును చేస్తున్నారు. కొన్ని మద్యం సీసాలు భూమిలో కనపడకపోవడంతో దున్నిన సమయంలో బయటికి వచ్చి కాళ్లకు గుచ్చుకుంటున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా మద్యం బాబులు మద్యం సేవించిన తర్వాత ఖాళీ సీసాలను ఒకచోట ఉంచి వెళితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు కోరుతున్నారు. అలాగే ఓపెన్ ప్లాట్, వెంచర్లలో సాయంత్రం పూట వాకింగ్ చేసే వాళ్లకు ఎక్కడ పడితే అక్కడ పగిలిన సీసాలు ప్రమాదకరంగా మారి ప్రాణాలకే ముప్పు తెచ్చే అవకాశం ఉందని జనాలు అంటున్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు కూడా అధికంగా ఉండటంతో యువత మద్యం తాగడం ఎక్కువవుతుందని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మందు అమ్మడంతో ఎక్కడబడితే అక్కడ తాగి సీసాలను పగలగొట్టి పడవేస్తున్నారని రైతన్నలు, ప్రజలు వాపోతున్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

### డీఎస్పీ ఎన్. లింగయ్య



మాట్లాడుతున్న డీఎస్పీ

**నారాయణపేట, జూన్ 14 ప్రభాతవార్త :** శనివారం జిల్లా నారాయణపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులకు డీఎస్పీ ఎన్.లింగయ్యడీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగే నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సిఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతు గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏ ఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలి. కేసుల్లో శిక్షల శాతం పెంచాలి, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి, పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి, కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి, అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాట పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలి, ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి,60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని, ప్రతిరోజు కేసులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. కేసులను అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి చాలెంజిగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ శివ శంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాముడు, రాజు, మహేశ్వరి, స్టేషన్ రైటర్లు మొదలగువారు పాల్గొన్నారు.

## రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



బురద, గుంతలమయంగా మారిన రోడ్డు

**చినుకు పడితే రోడ్డంతా చిత్తడే చిత్తడీ**

**రోడ్డును పట్టించుకునే వారు లేరు అంటున్న గ్రామస్తులు**

**నారాయణపేట టౌన్, జూన్ 14 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం పిడెంపల్లి గ్రామానికి మట్టి రోడ్డు సౌకర్యం ఉంది. చినుకు పడితే చాలు రోడ్డంతా చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. అత్యవసర సమయంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అవసరాల నిమిత్తం దామరగిద్ద, నారాయణపేటకు వెళ్లాలంటే గ్రామం నుండి మెయిన్ రోడ్డుకు రావాలంటే మూడు కిలోమీటర్లు దూరం కాలి నడకే దిక్కు. ప్రతిరోజు విద్యార్థులు ఖాళీ నడకతో ఈ రోడ్డు ఉన్న నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా నీళ్లతో ఆగిన గుంతలు చిత్తడి చిత్తడిగా ఉంటుంది. గత్యంతరం లేని పరిస్థితులు పోవలసి వస్తుంది. ఈ రోడ్డు గుండా వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.రోడ్డు ఇలా ఉంటే ప్రయాణం ఇలా చేయాలని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆదమరచి డ్రైవింగ్ చేస్తే బురదలో పడాల్సిందే. ద్విచక్ర వాహనదారులు బురదలో పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ మట్టిరోడును బీటి రోడ్డుగా మార్చాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన స్పందన లేదని గ్రామ నాయకులు, గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ఎమ్మెల్యే పర్ణిక రెడ్డియైన ఇలాంటి రోడ్లను దృష్టిలో ఉంచుకొని బిటి రోడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

# కార్మిక హక్కుల కోసం సిఐటియు పోరాటాలు

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ పి.జయలక్ష్మి




మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ పి.జయలక్ష్మి

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 14 ప్రభాతవార్త:** కార్మికుల పక్షాన కార్మిక హక్కుల కోసం నిరంతరంగా సమరశీల పోరాటాలు నిర్వహించేది సిఐటియు మాత్రమేనని ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ పి.జయలక్ష్మి ఉద్ఘాటించారు. శనివారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్మికు ఉద్యమ చరిత్ర సీఐటీయూ విశిష్టత అనే అంశంపై కార్మికులకు బోధించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసత్వంలోకి నేటి నాలుగు కార్మిక కోడ్లు తీసుకొస్తున్నదని విమర్శించారు. జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. అంతకుముందు సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. వెంకట్రామిరెడ్డి శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై క్లాస్ బోధించారు. ఈ శిక్షణ తరగతులకు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ సీనియర్ జిల్లా నాయకులు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు జయంతి, వివోఎల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిబి.శ్రీనివాసు, ఆడపిల్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లానాయకులు బాలప్ప, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

◆ ప్రధాని మోడీని ఆదర్శంగా తీసుకుని ప్రతి కార్యకర్త పనిచేయాలి

◆ బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో కొండా ప్రశాంత్‌రెడ్డి పిలుపు

◆ భూత్పూర్ మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా గూటం శ్రీను




బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కొండా ప్రశాంత్‌రెడ్డి, దోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు

**భూత్పూర్,జూన్ 14,ప్రభాతవార్త:** బీజేపీ కార్యకర్తలు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ దేవరకద్ర నియోజకవర్గం ఇంచార్జీ కొండా ప్రశాంత్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.శనివారం భూత్పూర్ మండలం కొత్తమొల్గరలో జరిగిన బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో కొండా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పట్టు సాధించేందుకు బీజేపీ ప్రతి కార్యకర్త కృషిచేయాలని అన్నారు.దేశానికి మూడు మార్లు ప్రధానిగా ఉంటున్న ప్రధాని మోదీ దేశ ప్రజల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు.ప్రధాని మోదీని ఆదర్శంగా తీసుకుని బీజేపీ ప్రతి నాయకుడు,కార్యకర్త పనిచేయాలని కొండా ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ భూత్పూర్ మండల నూతన అధ్యక్షుడిగా గూటం శ్రీనును నాయకులు,కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇంచార్జీ దోకూరు పవనకుమార్‌రెడ్డి,జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి,కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చారి,జిల్లా కార్యదర్శి గాల్‌రెడ్డి,జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎండి ఫారూక్,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి,కొత్తకోట మండల అధ్యక్షుడు నరసింహ,దేవరకద్ర మండల అధ్యక్షుడు కృష్ణంరాజు,భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు నరసింహలతో పాటు నాయకులు మాధవరెడ్డి,తిరుపతిరెడ్డి,రాము,శంకర్‌నాయక్, సత్యం,బుచ్చన్న,అశోక్,సంజీవరెడ్డి,గోపాల్,శరబంద,లక్ష్మణ్‌గౌడ్, రమేష్,వెంకటేష్,చక్రంగౌడ్,అన్వర్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీజేపీ ముఖ్యనాయకులు,కార్యకర్తలు

**బీజేపీ భూత్పూర్ మండల నూతన అధ్యక్షుడిగా గూటం శ్రీను..**

బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం శనివారం భూత్పూర్ మండలం కొత్తమొల్గరలో జరిగింది.పార్టీ భూత్పూర్ మండల నూతన అధ్యక్షుడిగా గూటం శ్రీనును నాయకులు,కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తనపై నమ్మకముంచి పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గ,మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇంచార్జి ఇతర ముఖ్యనాయకులకు గూటం శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

# 24,713 కేసుల పరిష్కారం

### - మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి పాపిరెడ్డి



మాట్లాడుతున్న పాపిరెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్14, ప్రభాతవార్త:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 24,713 కేసులు పరిష్కరించారు. ఈ కేసుల పరిష్కారం కోసం మహబూబ్ నగర్ జిల్లా కోర్టులో 5బెంచీలను, జడ్చర్ల కోర్టులో 2బెంచీలను ఏర్పాటు చేశారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం "రాజీమార్గమే రాజ మార్గం" జిల్లా జడ్జి కోర్టులో మోటర్ వెహికిల్ యాక్సిడెంట్ కేసును నష్ట పరిహారం కోసం కక్షిదారులు దాఖలు చేశారు.ఈ కేసు నెం.457/2024లో నష్ట పరిహారం రూ..50, 00,000గాను ప్రతివాది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వారి మధ్య అంగీకారం ప్రకారం రూ.33,00,000 రాజీ మార్గంలో పరిష్కరించారు. కక్షిదారుల న్యాయవాది అశోక్ గౌడ్ అవార్డును కక్షిదారులకు జిల్లా జడ్జి బి.పాపిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి (ఫ్యామిలీ కోర్టు) శ్రీదేవి, జడ్జి పోక్సో కోర్టు రాజారాజేశ్వరి, వి. ఈశ్వరయ్య, ఎఫ్ఏసీ కార్యదర్శి, జిల్లా న్యాయ సేవా సంస్థ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక, స్పెషల్ జేఎంఎఫ్‌సీ మొబైల్ కోర్ట్ జడ్జి మహమ్మద్ మునావర్ హుస్సేన్, ఎ.రవి శంకర్ స్పెషల్ జేఎంఎఫ్‌సీ ఎక్సైజ్ కోర్ట్ జడ్జి, 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. ఎస్ కె.భావన, ,2వ క్లాస్ మేజిస్ట్రేట్ నిర్మల, శశిధర్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.జు.రమణ రెడ్డి, ఇన్సూరెన్స్ అడ్వకేట్స్, స్టాండింగ్ కౌన్సిల్స్,లోక్ అదాలత్ మెంబర్స్, కక్షిదారులు, అడ్వకేట్స్, పారా లీగల్ వలంటీర్లు అన్ని బ్యాంకుల సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ

**దేవరకద్ర, జూన్14 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని నియోజకవర్గం శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి ఆదేశానుసరం దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూనేటి అంజిల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన 15 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులలో భాగంగా పాపిగారి లక్ష్మిశేఖర్ వచ్చిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఇంటి నిర్మాణం కోసం ప్లానింగ్ శనివారం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండలం ఎంపీడీఓ శ్రీనివాసులు, మండల ఏఈ, గ్రామ పంచా యతీ కార్యదర్శి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 5583 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారం

**నారాయణ పేట, జూన్14 ప్రభాతవార్త:** జాతీయ న్యాయ సేవాధికార ఆదేశాలకు నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నారాయపేట జిల్లా కేంద్రంలోని, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి చైర్మన్ బోయ శ్రీనివాసులు లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్యనాయక్ జూనియర్ సివిల్ జడ్జి మమతా రెడ్డి హాజరై శనివారం కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో అన్ని కోర్టు పరిధిలో 5583 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. జిల్లాలో 14 పోలీస్ స్టేషన్లతో పాటు రెండు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల (కోస్గి, నారాయణపేట) పరిధిలో ఉన్న కేసులకు న్యాయవాదులు సహకరించి పరిష్కారానికి కృషి చేశారు. కాగా మొత్తం కేసుల పరిష్కారానికి గాను రూ 26,52,800 ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని ప్రధాన న్యాయమూర్తితెలియజేశారు ఈ కార్యక్రమంలో నర్సిములు, కాళప్ప, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు 14.. ఓపెన్ 44

మొదటి పేజీ తరువాయి భాగం..

మాత్రం బోధించడం లేదని తల్లిదండ్రులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. ఇంజినీరింగ్ కాలేజీల కన్నా ఫీజులు వసూలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇంజినీరింగ్ కాలేజీల్లో ఉన్న ఫీజు కన్నా ప్రైవేటు స్కూళ్లలో ఫీజు ఎక్కువ ఉందని వాపోతున్నారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు దాదాపుగా 13ఏండ్ల పాటు పాఠశాల విద్య కొనసాగనున్న ఆస్తులు అమ్మినా ఫీజులు సరిపోతుందా అనే రీతిలోచదువు'కొనే' పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నామని, సంపాదనలో రూపాయి కూడా పొదుపు చేయలేని పరిస్థితికి వస్తున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అమలు కానీ జీవోలు:** సర్కారు యుద్ధప్రాతిపదికన జీవోలు జారీ చేయడం అవి అమలు కాకుండా ప్రైవేటు యాజమాన్యాలు కోర్టులను ఆశ్రయించడం పరిపాటిగా మారింది. ప్రైవేటు స్కూల్ ఫీజుల నిర్వహణ, నియంత్రణ, స్కూల్ రవాణా వ్యవస్థ, విద్యా హక్కు చట్టం అమలుపై ప్రతి ఏటా ప్రభుత్వం జారీ చేస్తూనే ఉన్నది. పాఠశాలల యాజమాన్యాలు కూడా అయితే, జీవో రాగానే అందులో లోపాన్ని పట్టుకొని ప్రైవేట్ స్కూళ్లు కోర్టుకు వెళ్లడం స్టే తెచ్చుకోవడం షరామాములుగామారింది. స్కూల్ ఫీజులపై ప్రభుత్వం 1994 జనవరి 1 జీవో నెంబర్ 1ని, 2009 జూన్ 18న జీవో నెంబర్ 376, 2009 ఆగస్టు 6న జీవో 91, స్కూల్ భవన నిర్మాణాలు ఏ విధంగా ఉండాలనే దానిపై 2008 సెప్టెంబర్ 27న జీవో 123ని, 2008 జూలై 7న ఎంత మంది విద్యార్థులు ఉంటే ఎంత మైదానం ఉండాలి అనే విషయాలపై జీవో 88ని విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం కింద ఒక క్లాసులో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, బీసీ, మైనార్టీలకు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటూ జీవో 44 ద్వారా ఆదేశాలు ఇలా ఎన్నో జీవోలు జారీ అయినా ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.ఈ జీవోల అమలుపై ఎవ్వరుఎక్కడా మాట్లాడడం, స్పందించకపోవడం గమనార్హం.

## సన్న బియ్యం పంపిణీలో అవకతవకలు

మొదటి పేజీ తరువాయి భాగం..

చేయక పలు దుకాణాలు మూతపడ్డాయన్నారు. రేషన్ కార్డులు పట్టుకొని ప్రజలు బియ్యం కోసం కాళ్ళ అరిగేలా తిరుగుతున్నాంన్నారు. స్టాక్ ఉన్నచోట గంటలతరబడి క్యూలో నిలబడి చివరికి స్టాక్ లేకపోవడంతో బాధతో ఇంటికి వెళ్తున్నారన్నారు. రేషన్ షాప్‌లో క్యూలో చివర ఉన్నవారికి ఈరోజు రేషన్ దొరకలేదన్నారు స్టాక్ వస్తే మళ్లీ పంపిణీ చేస్తామని డీలరు చెప్పారన్నారు. జూన్ జూలై ఆగస్టు మూడు నెలల స్టాకు ఒకేసారి పంపిణీతో ఒక్కొక్కరికి ఇచ్చేందుకు 15నుంచి 20 నిమిషాలు పడుతోందన్నారు. తగినంత స్టాక్ రేషన్ షాప్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాక బియ్యం పంపిణీలో స్టాక్ పాయింట్ నుంచి డీలర్ వరకు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. 50 కిలోల బియ్యం ఖాళీ బస్తా బరువు 568 గ్రాములు ఉంటుందని అధికారులు చెబుతున్నారన్నారు. ఖాళీ బస్తా బరువు పోను 50 కిలోల నెట్ బియ్యం సంచిలో ఉండాలన్నారు. కానీ స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా చేస్తున్న కొన్నిబియ్యం బస్తాల్లో 44 నుంచి 48 కిలోల బియ్యమే ఉంటున్నాయని డీలర్లు చెబుతున్నారన్నారు. పంపిణీలో ఆ తరుగును భర్తీ చేసుకునేందుకు డీలర్లు ప్రతి కార్డు హోల్డర్ కు అరకిలో ఆ పైగా బియ్యం తక్కువ ఇస్తున్నారన్నారు. చివరకు వినియోగదారుడే నష్టపోతున్నారన్నారు. రేషన్ షాప్‌లలో కొందరికి శనివారం నాడు నాణ్యతలేని బియ్యం ఇచ్చారన్నారు. ఈ అవకతవకలపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్య తీసుకోవాలని కోరారు. ఈ నెల వరకు జారీ అయిన అన్ని కొత్త రేషన్ కార్డులకు కూడా బియ్యం ఇవ్వాలన్నారు. రేషన్ షాపుల్లో 18 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీలో అవకతవకలు అరికట్టి, పంపిణీ ఇబ్బందులు తీర్చకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పట్టణ సహాయ కార్యదర్శి ఎర్ర కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్దిన్నె లింక్ కెనాల్‌కు రూ.120కోట్లు

మొదటి పేజీ తరువాయి భాగం..

జరుగుతుందని దానికి ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. దానితోపాటు రాజీవ్ యువశక్తి పథకాన్ని కూడా త్వరలో నిరుద్యోగ యువకులకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా వీపనగండ్ల సంగినేనిపల్లి కలవరల్ల గ్రామాలలో జై భీమ్ జై బాబుజి జై సంవిధాన్ అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమంలో భాగంగా ఆయన ఈ గ్రామాలలో పర్యటించి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించినటువంటి రాజ్యాంగం ద్వారానే ఈరోజు పేదల అందరికీ హక్కులు వస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ర్యాలీ కన్నా ముందుగా వీపనగండ్ల సంగినేనిపల్లి గ్రామాలలో అంబేద్కర్ బాబు జగ్జీవన్ రావు జ్యోతిరావు పూలే విగ్రహాలను కడిగి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో ఆయన మాట్లాడారు ఈ కార్యక్రమంలో వీపనగండ్ల మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ రైతుబంధు అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదాల బీరయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్ రెడ్డి, సగనమోని వెంకటస్వామి, అలియాస్ వైయస్ మునికొండ గోపి ,వీపనగండ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నక్క విష్ణు, బొల్లారం సుదర్శన్ రెడ్డి, గోపాల్దిన్నె బాల్ రెడ్డి, వీపనగండ్ల భరత్ రెడ్డి, పోతుల వెంకటరెడ్డి, మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి

**-మాజీ ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, జూన్ 14, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు పోయిన యాసంగి, వానాకాలం రైతుబంధును ఎగ్గొట్టారని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు, అసత్యపు ప్రచారాలతో గద్దెనెక్కిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండుసంవత్సరాలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న సందర్భంగా రైతు భరోసా వేస్తామని చెప్పి మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు సన్నద్ధమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందేందుకే కెటిఆర్‌కు నోటీసులు పంపి విచారణ పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు రేవంత్‌రెడ్డి తెరలేపారన్నారు. కెసిఆర్, హరీష్‌రావులకు కూడా కమిషన్ నోటీసుల పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ విఫలమై పూటకో మాటతో నోటీసుల పేరుతో కాలయాపన చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయలబ్ధి పొందుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి పాలన చేతగాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 420 హామీలను, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మంత్రి సీతక్క రైతులకు రైతు భరోసాను పూర్తి స్థాయిలో వేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా డైవర్షన్ రాజకీయాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు గడియారం స్వామిచారి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వార్షికోత్సవం



శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, జూన్ 14, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం 37వ వార్షికోత్సవాన్ని వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, 54లీటర్ల పాలాభిషేకం, గోపూజ, కుంకుమార్చన, అమ్మవారి పారాయణం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, పట్టణ కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ధి బిక్షపతి, నాచారం ఆలయ మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, వాసవిక్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, ఏఎంసి డైరెక్టర్ శ్రీనివాస్‌గుప్త, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి. సంతోష్, ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉమేష్, భూమేష్, కైలాస ప్రశాంత్, నేతి చిన్న శ్రీనివాస్, భద్రయ్య, దూబకుంట మైత్రాములు, ఆర్యవైశ్యసంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## కరాగార పర్యవేక్షులుగా కళాసాగర్



కేంద్ర కరాగార పర్యవేక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కళాసాగర్

**కంది, జూన్ 14, ప్రభాతవార్త:**
కందిలోని కేంద్ర కరాగారం పర్యవేక్షకులుగా కళాసాగర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు పర్యవేక్షకులుగా బాధ్యతలు నిర్వహించిన సంతోష్‌కుమార్ రాయ్ హెడ్‌క్వార్టర్‌లో రిపోర్ట్ చేశారు. వరంగల్‌లోని ఖైదీల వ్యవసాయక్షేత్రం నుంచి బదిలీపై వచ్చిన కళాసాగర్ కార్యాలయానికి చేరుకోగా కరాగారం అధికారులు ఘనంగా స్వాగతం పలుకగా కళాసాగర్ పర్యవేక్షులుగా బాధ్యలు స్వీకరించారు.

## కల్లుగీత కార్మికసంఘం నూతన అధ్యక్షుని ఎన్నిక



నియామక పత్రాన్ని అందుకుంటున్న పాలకవర్గం

**హుస్నాబాద్ రూరల్, జూన్ 14, ప్రభాతవార్త:**
తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం పందిల్లగ్రామ నూతన అధ్యక్షునిగా బొమ్మగాని ప్రశాంత్‌గౌడ్ ఎన్నికైనట్లు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఎన్నికల అధికారి శ్రావణ్ ప్రకటించారు. శనివారం తెలంగాణ సహకార సంఘం ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో జరిగిన ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా శ్రావణ్ హాజరై ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఎన్నికలో సంఘంలో సభ్యత్వం ఉన్న సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా నూతన అధ్యక్షునిగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా బొమ్మగాని శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు డైరెక్టర్లుగా బొమ్మగాని రవిందర్‌గౌడ్, గాధగోని సమ్మయ్యగౌడ్, బొమ్మగాని తిరుపతిగౌడ్, బండి సంపత్‌గౌడ్, పూదరి రవిందర్‌గౌడ్, బంధారం రాధవ్వలు ఎన్నికైనట్లు ప్రకటించి ధృవీకరించి వారికి నియామకపత్రాలు అందజేశారు. నియామకమైన ఈ పాలకవర్గం నేటినుండి ఐదేళ్లవరకు కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రానున్న రోజుల్లో సంఘం బలోపేతంతో పాటు ప్రభుత్వం నుండి సంఘానికి రావాల్సిన పథకాలను సాధించుకునేందుకు ముందుంటూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు.

## రైతుభరోసా సకాలంలో విడుదల చేయాలి

**-సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**సదాశివపేట, జూన్ 14, ప్రభాతవార్త:**
రైతులకు సకాలంలో రైతుభరోసాను విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జయరాజు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రతి హామిని అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రైతులందరికి వెంటనే రుణామాఫీ చేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకుండా పోయాయని విచారం వ్యక్తం చేశారు. బ్యాంకులు రుణాలు ఇవ్వడంలో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి ప్రవీన్, మండల నాయకులు రమేష్‌గౌడ్, భూషణం, టీ యెషబు, దశరథ్ నర్సింలు, అనిల్, ఎండి ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాస్యూటికల్ పరిశోధనలో రాధిక ముత్తడికి పిహెచ్‌డి

**పటాన్‌చెరు, జూన్ 14, ప్రభాతవార్త:**
ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని రాధిక ముత్తడిని డాక్టరేట్ వరించింది. సూపర్ సాచురబుల్ సెల్ఫ్‌నానో ఎమల్సిఫైయింగ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ (ఎస్ఎన్ఈడిడిఎస్) ఉపయోగించి బిసిఎస్ క్లాస్॥ ఔషధాల ద్రావణీయత, జీవలభ్యతను పెంచడంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించారు. ఈపరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రాధిక సమర్పించిన సిద్ధాంత వ్యాసం పిహెచ్‌డిపట్టాకు అర్హతసాధించడంపట్ల గీతంవిశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, పలువిభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ రాధిక విజయం, గీతం విద్యా నైపుణ్యం, ప్రభావవంతమైన పరిశోధన పట్ల అచంచలమైన నిబద్ధతకు నిదర్శనమన్నారు.

## యోగ ప్రోటోకాల్‌పై అవగాహన

**రామాయంపేట, జూన్ 14, ప్రభాతవార్త:**
ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగశిక్షణ అవగాహన కార్యక్రమాల్లోభాగంగా శనివారం రామాయంపేటమండలం అక్కన్నపేట గ్రామంలో శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో యోగ ప్రోటోకాల్‌పై అవగాహన శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి యోగవిద్యను బహుమతిగా ఇచ్చినఘనత భారతదేశానికే సొంతం అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరితాదేవి, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మెటల్‌కుంటలో ఎంపి నిధులతో బోరు



ఎంపి నిధులతో బోరు డ్రిల్ చేయిస్తున్న కాంగ్రెస్ నేతలు

**న్యాల్‌కల్, జూన్ 14, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలోని బిసి కాలనీలో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ మంజూరు చేసిన డిఎంఎఫ్‌టి నిధులతో బోరును డ్రిల్ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్, జహీరాబాద్ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి బోరును డ్రిల్ చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ బిసి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ దృష్టికి తీసుకుపోగా స్పందించి సమస్య పరిష్కారానికి ఎంపి నిధుల నుంచి డబ్బులను మంజూరు చేయడంతో శనివారం కాలనీలో బోరును డ్రిల్ చేయించామన్నారు. గ్రామంలో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని గుండంగారి తిరుపతిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి పీటర్ రాజు, మాజీ వార్డు సభ్యులు పి మాణిక్‌రెడ్డి, సిహెచ్ నరేందర్, సిహెచ్ బాబు, టి.సంజీవ్, నాయకులు పాండురంగారెడ్డి, మహిపాల్, శేఖర్, సాలమన్, సంగన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతుసదస్సుతో రైతుల వద్దకు ప్రభుత్వం

**-తహసీల్దార్ పరమేశం**

**గుమ్మడిదల, జూన్ 14, ప్రభాతవార్త:**
భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని గుమ్మడిదలమండల తహసీల్దార్ పరమేశం అన్నారు. గురువారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వార్డు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉన్న ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేసి ప్రభుత్వ నిబంధన ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామన్నారు. భూభారతి చట్టం రైతులకు ఒక వరంలాంటిదని భూసమస్యలు ఉన్న రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారమార్గానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ వీరేశం, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ పవన్, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు సురభి నాగేందర్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆలేటి సంజీవరెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, పొన్నబోయిన వేణు, ఉప్పునూతల అశోక్ గౌడ్, సురభి వినోద్‌గౌడ్, ఇప్ప వినోద్, నాగేష్‌గౌడ్, కావలి శంకర్, శ్రీచూర్ణం చక్రపాణి, నల్ల మహేష్‌గౌడ్, బిక్షపతిరెడ్డి, సప్పటి మహేష్, మోహన్, మొగుళ్ల పెంటయ్య, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడ్డ వారికే నామినేటెడ్ పోస్టులు



రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న సీనియర్ నాయకులు దరిపల్లి చంద్రం

**సిద్దిపేట రూరల్, జూన్ 14, ప్రభాతవార్త:**
పార్టీ అధికారంలో లేని సమయంలో పార్టీ కోసం కష్టపడ్డ వారికే నామినేటెడ్ పోస్టులు వరిస్తాయని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపినట్లు టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. త్వరలోనే సిద్దిపేటలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని సిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్కారు చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించి పార్టీని మరింతబలోపేతం చేయాలని సూచించినట్లు దరిపల్లి చంద్రం వివరించారు.

## ప్రతి పేదవాడికి ఇంటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**-ఆత్మకమిటీ ఛైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

**గుమ్మడిదల, జూన్ 13, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండల పరిధిలో కొత్తపల్లి గ్రామంలో ఎంపిడివో ఉమాదేవి, ఆత్మకమిటీ ఛైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ప్రతి పేదవారికి సొంతింటి కల సాకారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, ఆగం రాజు, మామిళ్ళ చంద్రయ్య, పెండం ప్రభు, హనుమంత్‌రెడ్డి, నీరుడి మల్లేష్, నీరుడి నర్సింలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

**హుస్నాబాద్ టౌన్, జూన్ 14, ప్రభాతవార్త:**
పట్టణకేంద్రంలో శనివారం గౌడసంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల వేడుకలలో మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తిశ్రద్ధలతో తరలివెళ్లారు. శివసత్తుల పూనకాలు, భక్తుల కోలహాలు, డప్పు చప్పుళ్ల మధ్య గౌడకులస్థులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు నైవేద్యంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వర్షాలు సంమృద్ధిగా కురవాలని, పాడి పంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

## స్కావెంజర్లపై ఎంఈఓల పెత్తనం తగదు

**-ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు**



సమావేశంలోమాట్లాడుతున్న ఎఐటియుసి జిల్లాఅధ్యక్షులు నీరుడుసాయిలు

**రామచంద్రాపురం, జూన్ 14, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కాంవెజర్లపై ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుల పెత్తనం తగదని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు హెచ్చరించారు. శనివారం బిహెచ్ఈఎలన టౌన్‌షిప్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో స్కావెంజర్ల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లకు, స్వీపర్లకు వేతనాలు పెంచడం మరిచిన అధికారులు పనిభారం పెంచడం ఏమిటని ప్రశ్నించారు. మండలాల వారీగా స్కావెంజర్లు, స్వీపర్లతో బాత్‌రూంలను, టాయిలెట్‌లను పరిశుభ్రం చేయించడం, పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను వారితో తొలగించడం, ప్రొద్దున, సాయంత్రం శుభ్రపర్చాలని ప్రధానోపాధ్యాయులు బెదిరిస్తూ, ఒత్తిడికి గురిచేస్తూ పనులు చేయించుకోవడం మానుకోవాలని హితవు పలికారు. స్కావెంజర్లకు, స్వీపర్లకు నెలకు 26వేల రూపాయల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. సౌకర్యాలు అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 23న స్కావెంజర్లు, స్వీపర్లతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి బి.లక్ష్మి, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, స్కావెంజర్లు, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ పాలన ప్రపంచంలోనే భేష్

**గుమ్మడిదల, జూన్ 14, ప్రభాతవార్త:**
ప్రధాని నరేంద్రమోడీ పరిపాలన 11సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి ఆదేశాల మేరకు గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని విజయసంకల్పసభ దోమడుగులో మండల పార్టీ అధ్యక్షులు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రతాప్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్, జిల్లా సీనియర్‌నాయకులు శంషాబాద్ రాజు పాల్గొన్నారు. నరేంద్ర మోడీ చేపట్టినటువంటి అభివృద్ధిని పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సామల అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.రాజు మండల కమిటీ ఆర్గనైట్ సెక్రెటరీ సర్ రెడ్డిగారి వీరారెడ్డి, పదాధికారులు కానుకుంట ముత్యాలగౌడ్, మండల కిసాన్ మోర్చా మాజీ ఉపాధ్యక్షులు సామల వెంకట్‌రెడ్డి, దోమడుగు బూత్ అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, పెంటారెడ్డి, సోమల సత్యనారాయణ, శక్తికేంద్ర ఇన్చార్జీలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ముగింపు

**చిన్నశంకరంపేట, జూన్ 14, ప్రభాతవార్త:**
మండల పరిధి వెంకట్‌రావుపల్లి గ్రామంలో మూడు రోజులుగా సాగిన క్రికెట్ ప్రీమియర్ లీగ్ శనివారంతో ముగిసింది. ఈలీగ్‌లో వెంకి వారియర్స్ ఎస్ఎల్ కింగ్స్ తలపడగా వెంకి వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు గ్రామ నాయకులు బహుమతులను అందించారు.

## రిజర్వేషన్ కల్పిస్తే ఎవరు అడ్డొస్తారో చెప్పాలి

**హవేలీఘనపూర్, జూన్ 14, ప్రభాతవార్త:**
బిసి రిజర్వేషన్ కల్పిస్తే ఎవరు అడ్డొస్తారు చెప్పాలని పూలే యునైటెడ్ ఫ్రంట్ తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి అన్నారు శనివారం మండల కేంద్రంలోని యునైటెడ్ పూలే ఫ్రంట్, జాగృతి ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని స్థానిక ఐబీ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరిముదిరాజ్ తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఈనెల 17న హెచ్ కన్వెన్షన్ హాల్ లో ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ నాయకులు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలల్లో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నారు. శాసనమండలి, శాసనసభలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించారని రాష్ట్రపతి ఆమోదం కోసం బిల్లు పెండింగ్ లో ఉందన్నారు. రాష్ట్రపతి ఆమోదించే వరకు ప్రత్యేక జీవో తీసుకువచ్చి బీసీలకు 42 రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలన్నారు. అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి దగ్గరికి తీసుకెళ్తానని, ఇప్పటివరకు సీఎం తీసుకెళ్లలేదని గుర్తు చేశారు. గతంలో ఇందిరాపార్కు వద్ద రాష్ట్ర బీసీ సంఘాల, జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ కోసం ఎన్నో పోరాటాలు చేసామని తెలిపారు. మెదక్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్రనాయకులు, జిల్లానాయకులు, వివిధకులసంఘ నాయకులు, బిసిలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతంచేయాలని కోరారు.

## బొంతపల్లి ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

**గుమ్మడిదల, జూన్ 14, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వార్డు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లలకు ఎంతో సంతోషంగా అక్షరాభ్యాసాన్ని చేశారు. ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పనిచేయాలని రాబోవు రోజుల్లో ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాల ఉత్తీర్ణత శాతం అత్యధిక ఉండాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను పంపే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.వినోద్ కుమార్, టీ సునీత, అపర్ణ, శారద, బుజ్జి బాయ్ కవిత, టీ నిర్మల, డి నిర్మల, ప్రాంతంలోని అంగన్వాడీ టీచర్లు శారద, ప్రమీల, స్వప్న, అంగన్వాడి టీచర్ పోచమ్మ, విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## చవితి పూజలందుకున్న చందన లేపనుడు

**న్యాల్‌కల్, జూన్ 14, ప్రభాతవార్త:**
సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మూడు గ్రామాల్లో స్వయంభువుగా కొలువున్న శ్రీసిద్ధివినాయక, శ్రీ వరసిద్ధివినాయక ఆలయంలో తొలిపూజలందుకునే వినాయకుడు భక్తులతో ప్రత్యేకపూజా కార్యక్రమాలు అందుకున్నారు. మండల పరిధిలోని రేజింతల్, హద్నూర్, చీకుర్తి గ్రామాల శివారులోని శ్రీసిద్ది వినాయక, శ్రీవరసిద్ధివినాయక ఆలయాలకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిద్ధివినాయక ఆలయంలో 20 మంది దాతల సహకారం, హద్నూర్ వరసిద్ధివినాయక ఆలయంలో గ్రామ భక్తుల సహకారంతో ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ(అన్నదానం) నిర్వహించారు. సిద్ధివినాయక ఆలయంలో తెల్లవారుజాము ఆలయ అర్చకులు గర్బగుడిలోని విగ్రహానికి అభిషేకం, చందన లేపనం చేసి రంగురంగుల పూలు, గరికతో అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవలను విస్తృతం చేస్తాం

**-జగ్గయ్యగారి శేఖర్‌గుప్త**

**గజ్వేల్ టౌన్, జూన్ 14, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్త శనివారం వాసవిక్లబ్ సభ్యులతోకలిసి స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని నిరుపేద మహిళా వ్యాపారస్థులకు గొడుగులు, గృహ నిర్మాణ కార్మికులకు సామగ్రి పంపిణీచేశారు. ఈసందర్భంగా వాసవిక్లబ్ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్త మాట్లాడుతూ వాసవి క్లబ్ సభ్యుల సహకారంతో సేవాకార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా డాన్‌టుడస్క్ ప్రోగ్రాం ద్వారా నిరుపేదలకు అండగా ఉండాలనే సంకల్పంతో ఉచిత డయాబెటిక్ క్యాంప్, ఉచితంగా సిమెంట్ బెంచీలు పంపిణీ, రైతులకు తట్ట, పార, మహిళా వ్యాపారస్థులకు గొడుగులు పంపిణీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాచారం దేవాలయ మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, రేగురి హనుమంత రావు, వేణు, పుల్లూరి శంకర్, హరికిరణ్, గంగిశెట్టి వెంకటేశం, భద్రయ్య, సిద్ధి నవీన్, కైలాస ప్రశాంత్, ఉమేష్, బుద్ద శంకరయ్య, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**-6 మందికి 1లక్ష 46వేల చెక్కులు**

**జహీరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 6 గురు అనారోగ్యానికి గురికాగా మెరుగైన చికిత్స అందుకునేందుకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు 1 లక్ష 46వేల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని సత్వార్‌గ్రామానికి చెందిన మొగులప్పకు 15వేలు, అనెగుంట గ్రామానికి చెందిన నిర్మలమ్మకు 55వేల5వందలు, అల్గోల్ గ్రామానికి చెందిన మీనాకు 20వేల5వందలు, చిరాగ్‌పల్లికిచెందిన జంగిలి శ్రీకాంత్‌కు 29వేల రూపాయల సిఎఆర్‌ఎఫ్ చెక్కులను అందచేశారు. చెక్కులు అందుకున్న బాధితులు ఎమ్మెల్యేకు అందుకు సహకరించిన బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ, ఫాక్స్ ఛైర్మన్ మచ్చేందర్, ఎస్టిసెల్ అధ్యక్షులు హీరురాథోడ్ బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగదీష్, గ్రామపార్టీ అధ్యక్షులు సత్వార్ సయీద్, అల్గోల్ చంద్రకాంత్‌రెడ్డి, ఆనెగుంట జగన్నాథం, నాయకులు స్వామిదాస్‌రాజు, వెంకటి, మల్లేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు వరం కెఎల్‌ఎస్‌ఎం పథకాలు

**-925 మందికి చెక్కులు అందచేసిన ఎంపి, ఎమ్మెల్యే**

**జహీరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:**
పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి(కెఎల్), షాదీముబారక్(ఎస్ఎం) పథకాలు వరంలాంటివని ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావులు అన్నారు. శనివారం పట్టణంలోని గౌరి ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 925మంది లబ్దిదారులకు 9కోట్ల 26లక్షల7వేల300వందల రూపాయల చెక్కులపంపిణీ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథులుగా ఎంపి, ఎమ్మెల్యేలు హాజరై లబ్దిదారులకు చెక్కులను అందచేశారు. ఈసందర్భంగా ఎంపి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ భారతదేశంలోని మరేరాష్ట్రంలో అమలుకావడం లేదని ఒక్క తెలంగాణలోనే కెఎల్, ఎస్ఎం పథకాలు అందచేస్తున్నామన్నారు. పేదింటి ఆడపిల్లల పెళ్లికి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం ఆసరాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెట్విన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఆర్‌డిఓ రామ్‌రెడ్డి, తహసీల్దార్ పి.దశరథ్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎస్.ఉజ్వల్‌రెడ్డి, పి.రామలింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత రావుపాటిల్, మక్సుద్, శుక్లవర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, కండెం నర్సింలు, నరేష్‌గౌడ్, ఎ.భీమయ్య, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, సంజీవ్‌రెడ్డి, వెంకటేశం, పాక్స్‌ఛైర్మన్ మచ్చేందర్, నాయకులు నామ రవికిరణ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం సిఎంఆర్‌ఎఫ్ పథకం

**-ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**

**గజ్వేల్ టౌన్, జూన్ 14, ప్రభాతవార్త:**
మెరుగైనవైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందే నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం వరం లాంటిదని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. గత కొద్ది రోజుల క్రితం హైద్రాబాద్‌లోని లోటస్ ఆసుపత్రిలో చికిత్స పొందిన సొక్కం పూజ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తుచేసుకోగా మంజూరైన రూ.33వేల చెక్కును శనివారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, బిఆర్ఎస్‌వి గజ్వేల్ మండల అధ్యక్షుడు పంగ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే కాలంలో కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

**-సిపిఎం రాష్ట్ర నాయకులు చుక్క రాములు**

**సిద్దిపేట రూరల్, జూన్ 14, ప్రభాతవార్త:**
రాబోయేకాలంలో కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం అవుతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. జిల్లాకేంద్రంలోని కార్మిక కర్షక భవనంలో శనివారం పార్టీజెండాను ఆవిష్కరించి అనంతరం ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అముదాల మల్లారెడ్డి, రాళ్లబండి శశిధర్, జి.భాస్కర్, గోపాలస్వామి, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, రవికుమార్, బాల్‌నర్సయ్య, శారద, కనకయ్య రాజు, రంగారెడ్డి, శ్రీనివాస్, శోభ, బాలమణి, పార్టీ శ్రేణులు, కార్మికులు పాల్గొన్నారు.

## డా॥బి.వెంకట్‌కు రాష్ట్ర విశిష్ట సేవా కీర్తి పురస్కారం

**కొమురవెల్లి, జూన్ 14, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత,సంస్కృతోపన్యాసకులు డా॥బి.వెంకట్ రాష్ట్ర విశిష్ట సేవా కీర్తి పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ, కళామారుతి వేదికలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2025 ముగింపు సభలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ శర్మ, ప్రధాన కార్యదర్శి సుప్రియగుప్త,ప్రముఖ కవులు చౌదూరి కళాపీఠం అధ్యక్షులు చౌదూరి నరసింహ్మారావు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. కవులు సత్యవీణ, వేము వందనం, అరుణ కుమారి, సుజాతారాణి తదితరులు వెంకట్‌ను అభినందించారు.

## లోక్ అదాలత్‌లో 25 కేసులు పరిష్కారం:

**ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి**

**హత్నూర, జూన్ 14, ప్రభాతవార్త:**
కేసులలో పరిష్కారం కొరకు శనివారం నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో 25 కేసులు పరిష్కారం చేయడం జరిగిందని హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 15 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, రెండు ప్రెట్టి కేసులు, 8 ఇతర కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించబడ్డాయని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.